# గడ్డు నెల

ఆయనకి ఫిబ్రవరి నెలంటే ఇష్టం. ఉద్యోగాలు చేసేవాళ్ళందరికీ ఇష్టమే ననుకుంటాను. జీతాలు రెండు రోజులు ముందుగానే దొరుకుతాయి. రెండురోజులకు పని తక్కువ. నెల ఇట్టే గడిచిపోయినట్లుంటుంది.

నాకు మాత్రం ఫిబ్రవరి అంటే ఇష్టంలేదు. కేవలం మావారి కిష్టమయినందువల్లనే నా కిష్టంలేకపోయిందని కాదు. పెళ్ళయిన సంవత్సరంలోనే ఫిబ్రవరి మాసం నన్ను మోసంచేసిందని నిజంగానే నాకు ఆ నెల అంటే అయిష్టత కలిగింది. ఎందువల్ల అయిష్టత ఏర్పడిందో ఆయనకి కూడా నేను చెప్పలేదు. ఆ రహస్యం చెబితే నవ్వుతారని భయం.

వివాహకార్యక్రమం ముగించగానే పురోహితుడు మమ్మల్నిద్దర్నీ పెద్దలందరికీ వరసగా నమస్కరించమన్నాడు. అత్తగారికీ, మామగారికీ, అమ్మకీ, నాన్నగారికీ వంగి పాదాలు కళ్ళకద్దుకున్నాం. తక్కినవాళ్ళు మనస్సులో ఏమని ఆశీర్వదించారో తెలియదు కాని, అమ్మ మాత్రం పైకే ఆశీర్వదించింది. "వచ్చే ఏటికి గుమ్మడి పండంటి కొడుకుని కనాలి" అంటూ, అంత అచ్చ తెలుగులో ఆశీర్వదించేసరికి నవ్వొచ్చి వొంగి ఉన్నదాన్ని చటుక్కున తలెత్తి అమ్మ ముఖంలోకి చూశాను. తను వెయ్యబోతున్న అక్షింతలు నా నెత్తిమీద పడబోయి నా కళ్ళమీద పడ్డాయి. ఒకటి కంటికి తగిలి నా కన్నమ్మట నీరొచ్చింది. ఆ తరవాత అన్నయ్య, వదిన, బావగార్లూ అక్కలూ అందరూ ఆశీర్వదించారు.

మధ్యాహ్నం పెళ్ళి హడావిడి అంతా తగ్గిన తరవాత దగ్గర బంధువులంతా మధ్యహాల్లో జంపఖానాలు పరిచి మమ్మల్నిద్దర్నీ మధ్యన కూర్చోబెట్టి మాకొచ్చిన బహుమతులన్నీ మా చుట్టూ పోగేశారు. అన్నీ తెరిచి చూడమన్నారు. మా చిన్న ఆడబిడ్డ ఒక నోట్‌బుక్, పెన్సిలూ తెచ్చుకుని లిస్టురాయటం మొదలుపెట్టింది. ఒక్కొక్క ప్రెజంటే అందుకుని ఆ పేకెట్‌లో ఏముందోనని నలుగురూ నాలుగు రకాలుగా ఊహించి, చివరికి లోపల్నించి

బయటపడిన దానిమీద వ్యాఖ్యానాలు చేస్తూ వ్యాఖ్యానాల మీద విరగబడి నవ్వుతూ చాలా సరదాగా గడిపాము. ముఖ్యంగా నా క్లాస్‌మేట్సంతా కలిసి ఇచ్చిన ప్రెజెంట్స్‌లో ఒకటి కుటుంబ నియంత్రణ సాధనం. "అవేమిటే అమ్మడూ" అంది బామ్మ. అంతా గొల్లుమని నవ్వుతూంటే ఆవిడ తన అజ్ఞానం బయటపడిందేమోనని చిన్నబుచ్చుకుంది పాపం. అప్పుడు మా అమ్మ రహస్యంగా ఆవిడ చెవిలో చెప్పింది.

"అయ్యో, అదేం బహుమానమే! శుభమల్లా పెళ్ళయితే పదిమంది పుట్టాలని కోరుకోక అదేంపని!" అని బుగ్గలు నొక్కుకుంది.

"పదిమందిని కనే రోజులు పోయాయి అమ్మమ్మగారూ, మేం దివాలా తీసిపోతాం మీరలా ఆశీర్వదించారంటే" అన్నారీయన నవ్వుతూ. బామ్మకూడా బోసినవ్వు నవ్వింది.

పెళ్ళయి రెణ్ణెల్లు కాకుండానే నా స్నేహితురాళ్ళు ఎవరన్నా కలిస్తే "ఎనీ న్యూస్?" అంటూ కన్నుగీటుతూ అడుగుతూండేవారు. బంధువులెవరన్నా కనబడితే "ఏమమ్మా, విశేషమేమన్నా ఉందా?" అని కుశలప్రశ్న వేసేవారు. మొదట్లో "ఛీ, వీళ్ళకింకో వ్యాపకంగాని, మరో ఆలోచనగాని లేనట్లుంది" అనుకునేదాన్ని. కానీ అయిదారు నెలలయేసరికి నా ఆలోచనలు కూడా అదే తోవలో పయనించటం ప్రారంభించాయి.

ఆయన పొద్దుట తొమ్మిది అవుతూనే బయలుదేరి ఆఫీసుకి వెళ్ళి పోయేవారు. ఆయన ఆఫీసు మా ఇంటికి ఆరుమైళ్ళదూరం. మళ్ళీ ఇంటికొచ్చేసరికి సాయంకాలం ఆరు దాటిపోయేది. రోజంతా ఇంట్లో ఒక్కర్తినీ కాలుకాలిన పిల్లిలా తిరుగుతూండేదాన్ని తోచక. వంట పని ఎంతగా కల్పించుకుందామన్నా ఇంకా ఎంతో తీరిక సమయం ఉండి ఏంచెయ్యాలో తోచేది కాదు. పక్కిళ్ళలోకూడా ఈడూ జోడూ అయిన నేస్తాలెవరూ దొరకలేదు. ఏదైనా పుస్తకంగాని పత్రికగాని దొరికితే చదువుకోవటం, లేకపోతే వివిధభారతి వినటం, లేకుంటే నిద్రపోవటం-ఈ కార్యక్రమంతో ఆరునెల్లకే బోరెత్తిపోయింది. వివాహజీవితం అంటే ఇంతేనా అని నిరుత్సాహం కూడా కలిగింది. అటువంటి నిరుత్సాహపు ఘడియల్లోనే నా ఆలోచనలు పసిపాపలవైపుకి మళ్ళటం జరిగింది.

ఆరునెల్లయింది. ఇంకా ఏమీ కాలేదేమిటి అనిపించేది అప్పుడప్పుడు. ఆశ్చర్యం కూడా వేసేది. కథల్లోనూ సినిమాల్లోనూ ఎవరో అమాయకురాలిని ఒక దుర్మార్గుడు బలాత్కరించి వశపరుచుకుంటే తత్ఫలితంగా గర్భం ధరించటం ఎన్నోసార్లు చదివాను, చూశాను. అటువంటిది ఆరునెల్లయినా ఇంకా ఎందుకు కాలేదు? ఏమిటీ సృష్టివిచిత్రం? అర్థంగాక ఆయన్ని అడుగుదామంటే ఎందుకో చచ్చేటంత బిడియం, ఎంత చనువైన

మనిషి అయినా ఈ విషయం ప్రస్తావించాలంటే ఇంకా ఆయన కొత్తమనిషిలాగే అనిపించారు.

ఓ రోజున నేను తోచటంలేదని గోలపెడుతూంటే ఆయనే అన్నారు "ఇంకా ఎన్నాళ్ళులే, ఒక్క పాప పుట్టిందంటే నీకు నాతో మాట్లాడే తీరిక కూడా ఉండదు" అని "తొందరగా పుడితే బాగుండును" అన్నాను. అనేశాక సిగ్గుతో తలవంచుకున్నాను.

"అంత తొందరగా ఉంటే డాక్టరు దగ్గరికి పోదాంపద" అన్నారాయన. నవ్వుతూనే అన్నప్పటికీ ఆయన కంఠంలో కొంత పట్టుదల స్ఫురించింది.

ఆ మర్నాడే చాలా పేరున్న లేడీ డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళారు నన్ను. ఆవిడ పరీక్షచేసి "ఏం ఫరవాలేదు, ఆరునెల్లేకదా అయిందన్నావు" అంది చాలా తేలిగ్గా. ఆవిడ అంత తేలిగ్గా కొట్టిపారేసినందుకు నేనుబరువుగా నిట్టూర్పు విడిచాను. ఏమన్నా చిట్కా చెబుతుందేమో ననుకుంటే ఈవిడ ఇలా తోసిపారేస్తుందేమిటని నిస్పృహ కలిగింది. నా ముఖం చూసి ఏమనుకుందో-ఆవిడ మళ్ళీ అడిగింది. "పీరియడ్స్ రెగ్యులర్‌గా అవుతున్నాయా, ఏమన్నా సమస్య ఉందా" అని. చాలా కరెక్టుగా అవుతున్నాయని చెప్పాను. లోలోపల-రెగ్యులర్‌గా లేకపోయినా బావుండేది, ఏదన్నా మందిచ్చునేమో-ఉత్తిచేతుల్తో పోకుండాను-అనుకున్నాను. ఆవిడ ఏ చిట్కా చెప్పకుండా ఏ మందూ ఇవ్వకుండా కన్సల్టేషను ఫీజు మాత్రం తీసుకుని నా భుజంతట్టి "హాయిగా ఆనందించు, ఏం బాధపడకు" అని చెప్పి పంపించింది.

మరో నాలుగునెలలు ఆశ నిరాశల మధ్య ఊగులాడాను. ప్రతిసారీ ఆయన కూడా నా నిరాశలో పాలుపంచుకున్నారు. నా మనస్సుకి ఉల్లాసం కలిగించటానికి ఆయన పదిరోజులు సెలవు తీసుకుని నన్ను ఆగ్రా తీసుకువెళ్ళారు తాజ్‌మహల్ చూపించటానికి. ఇద్దరం ఆ అత్యంత సుందర మందిరాన్నీ, వాతావరణాన్నీ చూసి ఆనందంతో తన్మయం చెందాం. ఆ ప్రయాణం మా ప్రణయాన్ని మరింత ప్రగాఢం చేసింది. నూతనోత్సాహంతో ఇల్లు చేరుకున్నాం.

కావలసిన రోజు సమీపిస్తున్న కొద్దీ నాలో రక్తపు పొంగు ఎక్కువై పోయింది. కాకూడదు, కాకూడదు, కాకుండా చెయ్యమని వెయ్యి కంఠాలతో దేవుణ్ని ప్రార్థించాను. ఆ రోజు గడిచిపోయింది. మర్నాడు మరింత గుండె బిగువుతో గడిపాను. ప్రతిక్షణం ఒక భయంకర క్షణంగా రక్తం కళ్ళ చూస్తానన్న వెర్రిభయం-క్షణక్షణం భగవంతుని ప్రార్థించాను - ఈ రోజు కూడా గడిచిపోనీ అని. రెండురోజులు గడిచేసరికి నా ప్రాణం కాస్త కుదుట పడింది. కొంచెం ధైర్యం చిక్కింది. నిజమా నిజమా అని అనుమానం. అద్దంలో ముఖం

చూసుకుంటే వింత అందంతో వెలిగిపోయింది నా ముఖం. ఇహ నాకు తోచక పోవటం అంటూ ఉండదు అనుకున్నాను. నా ఆనందాన్ని ఆయనతో పంచుకోవటానికి నామనస్సు తహతహలాడింది. ఆయన ఆఫీసు నుంచి వచ్చే వరకూ ఘడియ ఘడియకూ గడియారం చూస్తూ ఉరకలెత్తుతున్న మనస్సుతో ఎదురుచూశాను. ఆయన వస్తూనే నా కళ్ళలో వెలుగుని చూశారు. "ఏమిటి విశేషం?" అన్నారు, బాగ్ చేతికి అందిస్తూ, "ఏం లేదు" అన్నాను. ఎందుకో నా నోటితో ఎలా చెప్పాలో అర్థం కాలేదు. టిఫిను తింటూ "ఏమిటివాళ ఇంత మంచి టిఫిను చేశావు-ఏమిటి విశేషం" అన్నారు మళ్ళీ. నేను చెప్పకుండా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను. రాత్రి మాత్రం ఇక ఉండబట్ట లేకపోయాను. నా అనుమానాన్ని వెల్లడించాను. ఆనందంతో ఆయన నన్ను దగ్గరికి లాక్కుని ఒద్దు ఒద్దంటున్నా ఉక్కిరి బిక్కిరి చేశారు.

మర్నాడు పొద్దున్నే నేను ఏడుస్తూంటే ఆయన చూసి కంగారు పడి పోయారు. పుట్టింటిని విడిచి వచ్చేటప్పుడు కూడా ఏడవలేదు నేను. మొట్టమొదటి సారిగా ఏడవటం చూసి ఆయన చాలా బాధపడిపోతూ నా దుఃఖాన్ని ఎలా అర్థం చేసుకోవాలో ఎలా సముదాయించాలో తెలియక తికమక పడిపోయారు.అసలు సంగతి తెలిశాక తేలిగ్గా నవ్వేస్తూ "ఈ మాత్రం దానికేనా అంత బాధపడుతున్నావ్! అయినా రెండు మూడు రోజులకే అలా ఎలా నిశ్చయాని కొచ్చావ్!" అన్నారు. ముక్కు ఎగబీలుస్తూ చెప్పాను. ఇంత వరకు నా కెప్పుడూ ముందుగా అవటమే గాని ఒక్క రోజు కూడా దాటలేదని.

"అయినా అంత టెన్షన్‌లో ఉండకూడదెప్పుడూ. టేకిట్ ఈజీ" అన్నారు ఆప్యాయంగా నా భుజం తట్టుతూ - ఆ లేడీ డాక్టరు లాగ.

ఆయన ఆఫీసుకి వెళ్ళిన తరువాత తీరిగ్గా సింహావలోకనం చేసుకోవటం మొదలు పెట్టాను. నిజంగానే మానసికోద్రేకం వల్ల ఇలా జరిగిందా అని ఆలోచిస్తే అది నాకు సరియైన సమాధానంగా తోచలేదు. ఇది వరకు చదువుకుంటున్న రోజుల్లో పరీక్షల సమయాల్లో ఎన్నిసార్లు తీవ్రమయిన మానసికోద్రేకానికి గురికాలేదు! అయినా ఎప్పుడూ ఇలా జరిగినట్లు గుర్తు లేదు. మరిప్పుడు ఎందుకు జరిగింది? ఒక వేళ లెక్క తప్పు చేశానేమోనని కాలెండరు తెచ్చి ఒళ్ళో పెట్టుకుని తాపీగా తారీఖులు లెక్క పెట్టాను. రహస్యం-గడిచిన నెల ఫిబ్రవరి!

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 17-1-1975)*